## చిప్ పరిశ్రమకు మోడీ ప్రభుత్వం బూస్ట్..
### 'సెమికాన్ 2.0' ప్రాజెక్టు ప్రారంభం

**న్యూఢిల్లీ,ఆగస్టు31:**దేశంలో సెమీకండక్టర్ తయారీ, డిజైన్ రంగాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 1.27 లక్షల కోట్ల వ్యయంతో 'సెమికాన్ 2.0' పథకాన్ని సోమవారం నోటిఫై చేసింది. చిప్ పరిశ్రమలోని ప్రతీ దశకు (వాల్యూ చైన్) ఆర్థిక రక్షణ, మద్దతు అందించేలా ఈ పథకాన్ని రూపొందించారు.
సెమీకండక్టర్ డిజైన్, చిప్ తయారీకి అవసరమైన పరికరాలు–పదార్థాల ఉత్పత్తి, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్లు, చిప్ అసెంబ్లీ–ప్యాకేజింగ్, పరిశోధన–అభివృద్ధి (=డఖ), నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి వంటి రంగాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.


RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 284 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | మంగళవారం 1 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00


## ఉజ్బెకిస్థాన్‌లో మార్మోగిన ప్రధాని కవిత

**న్యూఢిల్లీ,ఆగస్టు31.:** ప్రధాని నరేంద్ర మోదీ ఉజ్బెకిస్థాన్ పర్యటనలో రాజకీయ, దౌత్య అంశాలతో పాటు ఒక ప్రత్యేక సాంస్కృతిక ఘట్టం కూడా చోటు చేసుకుంది. మోదీ స్వయంగా రచించిన 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ఉజ్బెక్ విద్యార్థులు హిందీ, ఉజ్బెక్ భాషల్లో ఆలపించారు. ఈ కార్యక్రమానికి మోదీ కూడా హాజరయ్యారు. ఉదయించే సూర్యుడిని కొత్త ప్రారంభానికి ప్రతీకగా అన్వయిస్తూ 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ప్రధాని రాశారు ప్రధాని మోదీ రచించిన మూడు కవితలను తాష్కెంట్‌లోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియెంటల్ స్టడీస్‌లో విద్యార్థులు ఆలపించారు. ప్రతి కవితను హిందీతో పాటు ఉజ్బెక్ అనువాదంలోనూ వినిపించారు. ఈ ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ తాష్కెంట్‌లోని కుక్సారోయ్ ప్యాలెస్‌లో మోదీ కోసం ఏర్పాటు చేసిన అనధికారిక విందులో కూడా 'అభీ తో సూరజ్ ఉగా హై' ఆధారంగా ప్రత్యేక సంగీత ప్రదర్శన నిర్వహించారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్
## హల్ద్వానీ 'శుద్ధీకరణ' వివాదంలో కేసు నమోదు

**న్యూఢిల్లీ,ఆగస్టు31:**కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మల్లికార్జున ఖర్గే ర్యాలీ అనంతరం జరిగిన 'శుద్ధీకరణ' కార్యక్రమంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తమ సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీశాయని వాల్మీకి కమ్యూనిటీకి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆగస్టు 29న రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు తమ కమ్యూనిటీని అవమానించేలా ఉన్నాయని అమిత్ కుమార్ ఆరోపించారు. ఖర్గే ర్యాలీ జరిగిన అనంతరం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఆచార, పరిశుభ్రత కార్యక్రమాన్ని' రాహుల్ గాంధీ తప్పుగా చిత్రీకరించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిని అంటరానితనం పాటించే వారిగా, దళిత వ్యతిరేకులుగా చిత్రీకరించడం తమ మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. అమిత్ కుమార్ తాను ఎస్సీ కమ్యూనిటీకి చెందిన వ్యక్తినని తెలిపారు. తాము నిర్వహించిన కార్యక్రమానికి మల్లికార్జున ఖర్గే ర్యాలీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా,



వివిధ కులాలకు చెందిన వ్యక్తులతో పాటు ఎస్సీ కమ్యూనిటీకి చెందిన వారు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో అమిత్ కుమార్‌తో పాటు శ్రీ రామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్‌కు చెందిన వినోద్ ఆర్య కూడా ఉన్నారు. రాహుల్ గాంధీని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## అభివృద్ధే నా నైజం..
# రాజకీయాలు చేయను
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు

**ఖమ్మం,ఆగస్టు 31:**ఖమ్మం జిల్లాలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో అభివృద్ధి, ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని, పదవుల కోసం ఎప్పుడూ ఎవరినీ అడగలేదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి నా నైజం.. రాజకీయాలు చేయను తాను రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఎప్పుడూ రాజకీయాలు చేయాలని అనుకోలేదని తుమ్మల తెలిపారు. "నాకు పదవి కావాలని ఏనాడూ ఎవరినీ అడగలేదు. గతంలోనూ, ఇప్పుడు కూడా ప్రత్యేకంగా ఖమ్మం కావాలని కోరుకోలేదు. ఏ పార్టీని వ్యతిరేకించడం గానీ, ధిక్కరించడం గానీ నా ఉద్దేశం కాదు. నిరంతరం పని చేసే ముఖ్యమంత్రికి అండగా నిలవడమే నా బాధ్యత. మీరు ఓటు వేస్తారనే ఆశతో నేను ఈ రోడ్డు వేయడం లేదు. నన్ను గెలిపించిన మీ ఋణం తీర్చుకోవడానికే పనులు చేపడుతున్నాను" అని పేర్కొన్నారు.



గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలోనూ అడిగి నిధులు తెచ్చానని గుర్తుచేశారు. ఖమ్మంలో మంచినీటి సమస్యకు పరిష్కారంగా సీఎం రేవంత్ రెడ్డి రూ.250 కోట్లు ఇచ్చారని మంత్రి తెలిపారు. ప్రాంతం అభివృద్ధి చెందాలంటే దౌర్జన్యాలు, భూకబ్జాలు ఉండకూడదని, లా అండ్ ఆర్డర్ అదుపులో ఉండాలని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు తప్పు చేసినా కప్పిపుచ్చే ప్రసక్తే లేదని, తప్పు చేసిన వారిని కాపాడటానికి తాను ఏనాడూ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయలేదని తేల్చిచెప్పారు.

# భారత్‌కు భారీ వరద ముప్పు?
## హిమాలయాల్లో 200 ప్రమాదకర సరస్సులు గుర్తింపు



**న్యూఢిల్లీ,ఆగస్టు31:**నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. నేపాల్–టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశి, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు డాక్టర్ భూపేంద్ర మిలి తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న 'ఎ' కేటగిరీ' సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం.


## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్: మంత్రి పొన్నం



సిద్దిపేట జిల్లా, ఆగస్టు 31: జిల్లాలోని హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన కొనసాగుతోంది. ఉమ్మాపూర్‌లో రూ.7.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలికలు, బాలుర నూతన హాస్టల్ భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. వచ్చే సంవత్సరం ఆగస్టు లోపు ఇంజినీరింగ్ కళాశాలను పూర్తి చేసి జాతీయ జెండా ఎగరవేస్తామని చెప్పారు.తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ హుస్నాబాద్ నియోజకవర్గంలోనే పూర్తవుతుందని మంత్రి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ కళాశాలకు త్వరలో మరో రెండు బస్సులను తీసుకొస్తామని వెల్లడించారు. విద్యా ప్రమాణాలు బాగుంటేనే విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. త్వరలో హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమీని తీసుకొస్తామన్నారు. సౌకర్యాలు మావి ర్యాంకులు తెచ్చే బాధ్యత మీది అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఢిల్లీలో నిర్భయ తరహా దారుణం:
# కదిలే బస్సులో 16 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

**న్యూఢిల్లీ,ఆగస్టు31:**దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో నిర్భయ ఘటనను తలపించే మరో దారుణం వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ నుంచి వస్తున్న 16 ఏళ్ల మైనర్ బాలికపై కదులుతున్న స్లీపర్ బస్సులోనే డ్రైవర్, కండక్టర్ కలిసి విచక్షణారహితంగా గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఆగస్టు 4న చోటుచేసుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులైన డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్టు చేశారు. 47 కి.మీ ప్రయాణంలో అమానుషం.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని కుటుంబ సభ్యులతో గొడవపడి నోయిడాలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆమె గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వైపు వెళుతున్న ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు ఎక్కింది. గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ నుంచి ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వరకు ఉన్న దాదాపు 47 కి.మీ ప్రయాణ దూరంలో ఈ దారుణం జరిగింది.అయితే, స్లీపర్ బస్సు కిటికీలకు తెరలు (జబఖీఱఅం) వేసి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో బయటి వారికి కనిపించకుండా పోయింది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లు కదులుతున్న



బస్సులోనే బాలికపై అమానుషంగా అత్యాచారానికి ఒడిగట్టారు. దారుణం ముగిశాక బాలికను ఢిల్లీలోని కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద దింపి నిందితులు పరారయ్యారు. అనంతరం అచేతన స్థితిలో ఉన్న బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో వారు స్పాట్‌కు చేరుకుని ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బస్సు సమాచారం ఆధారంగా విచారణ జరిపి డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


# ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే
## ప్రభుత్వం మేల్కొంటుంది: హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 31: తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత



కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

# చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య



హైదరాబాద్, ఆగస్టు 31: నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# 'అసలైన శత్రువు ఎవరో గుర్తించండి'..
## ముస్లిం దేశాలకు ఇరాన్ సుప్రీం లీడర్ పిలుపు



**న్యూఢిల్లీ,ఆగస్టు31:**అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ముస్లిం దేశాలన్నీ ఐక్యంగా నిలబడాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఈ రెండు దేశాలే ఇస్లామిక్ దేశాలన్నింటికీ ఉమ్మడి శత్రువులని ఆయన అభివర్ణించారు. ముస్లిం దేశాల పాలకులు తమ నిజమైన శత్రువు ఎవరో తెలుసుకోవాలని, వారి ప్రణాళికలను అర్థం చేసుకుని ఎదుర్కోవాలని హితవు పలికినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' వెల్లడించింది.
టెహ్రాన్‌లో జరిగిన మత పెద్దల సదస్సుకు పంపిన ఒక లేఖలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆరు నెలల క్రితం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ తండ్రితో పాటు పలువురు సీనియర్ నేతలు మరణించారు. అప్పటి నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. 6 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నుంచి ఈ సందేశం వెలువడటం గమనార్హం.

## తుక్కుగూడ నర్సు హత్య కేసు.. అత్యాచారం జరిగినట్టు నిర్ధారణ

హైదరాబాద్, ఆగస్టు 31: తుక్కుగూడ నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నర్స్‌పై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. నిందితుడు సనావుల్లా కూడా అత్యాచారం చేసినట్టు అంగీకరించాడు. దీంతో పోలీసులు రేప్ సెక్షన్ ఆల్టర్ చేయనున్నారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి శనివార) అనుమానాస్పద స్థితిలో మరణించిన విషయం తెలిసిందే.రాఖీ పండగ సందర్భంగా తోటి నర్సులందరూ స్వగ్రామాలకు వెళ్లగా.. హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న యువతి హత్యకు గురైంది. దీంతో పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి.. ఆసుపత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పని చేస్తున్న సనా వుల్లా ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. కిటికీ నుంచి నిందితుడు హాస్టల్‌లోకి ప్రవేశించినట్టు



తెలుస్తోంది. అత్యాచారాన్ని నర్సు అడ్డుకోవడంతో.. సనా వుల్లా ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# సంపాదకీయం

## బీసీ వర్గాలకు ఎట్టకేలకు దక్కిన న్యాయం..!

కీలకతీర్పును వెలువరించిన భారత సుప్రీంకోర్టు.. బీసీ వర్గాల రిజర్వేషన్ల విషయంలో ఒక పెద్ద అవరోధాన్ని తొలగించింది. క్రీమిలేయర్‌ను అన్వయించే అంశంపై స్పష్టతనిచ్చిన సుప్రీంకోర్టు..కొందరు ఉన్నతాధికారుల తప్పుడు వైఖరి కారణంగా ఇరవై రెండు యేళ్లుగా రిజర్వేషన్ల హక్కుకు దూరమైన బీసీ బిడ్డల హక్కులను సగౌరవంగా పునరుద్ధరించింది. కంటికి కనిపించని, న్యాయస్థానాల పరిశీలనకు చిక్కని కుల వివక్ష.. బడుగు వర్గాల అభ్యర్థుల విషయంలో అనేక విధాలుగా అమలవుతున్నది. మొన్న ఇచ్చిన తీర్పుతో సుప్రీంకోర్టు.. బీసీ అభ్యర్థులను నానా అగచాట్లు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల మొండి వైఖరిపై మొట్టికాయలు వేసింది. క్రీమిలేయర్‌ను నిర్ణయించడానికి, ఆదాయాన్ని గణించడానికి అనుసరించిన విభిన్న ప్రమాణాలను వివక్షగా పేర్కొన్న సుప్రీంకోర్టు.. ఓబీసీ అభ్యర్థుల క్రీమిలేయర్ స్థితిని నిర్ణయించడానికి తల్లిదండ్రుల ఆదాయమే ఏకైక ప్రమాణం కాదని పేర్కొంది. నాటి విశ్వనాథ ప్రతాప్ సింగ్ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగా.. దేశంలోని మెజారిటీ వర్గమైన బీసీలకు (జాతీయ స్థాయిలో ఓబీసీలు) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మొదటిసారిగా రిజర్వేషన్లు దక్కాయి. వెనుకబడిన వర్గాలకు చేయూతను అందించిన పాపానికి వీపీ సింగ్ చివరికి తన ప్రధాన మంత్రి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. 1993 నుండి ఓబీసీ రిజర్వేషన్లు అమలు అయినవి. ఆ తర్వాత 2004లో డీఓపీటీ అదే అంశంపై ఒక వివరణ లేఖని విడుదల చేసింది. దీని ద్వారానే.. బీసీల ఉద్యోగావకాశాలను గద్దలు తన్నుకు పోయే కుతంత్రానికి తెర తీయబడింది. 2004 అక్టోబర్ 14న, కేంద్రం జారీ చేసిన లేఖలో.. ఖుజలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల విషయంలో.. ఆయా సంస్థలలోని ఉద్యోగుల కేటగిరీలను ప్రభుత్వ సంస్థలలోని పోస్టులతో సమానత్వ మూల్యాంకనం చేయనట్లయితే, ఆదాయ సంపద పరీక్ష ఆధారంగా క్రీమిలేయర్ స్థితిని తప్పనిసరిగా నిర్ణయించాలని గుర్తించింది. వేతనాల నుండి వచ్చే ఆదాయం, ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయాన్ని (జీతాలు మరియు వ్యవసాయ భూమి మినహా) విడిగా అంచనా వేయాలని నిర్దేశించింది. ఇటు వేతన ఆదాయం కానీ.. అటు ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయం కానీ.. వరుసగా మూడు సంవత్సరాలు నిర్దేశించిన పరిమితిని మించితే.. వారి పిల్లలు క్రీమిలేయరుగా పరిగణించబడ తారని పేర్కొన్నది. ఈ లేఖ కారణంగా.. క్రీమిలేయర్ నిర్ధారణ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు దక్కిన వెసలుబాటు.. ఖుజలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు దక్కకుండా పోయింది. ఆదాయాన్ని లెక్కించేటప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో జీతపు ఆదాయాన్ని పరి గణనలోకి తీసుకోవద్దన్నారు. అదే పీఎస్‌యూ, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగుల విషయంలో మాత్రం.. జీతపు ఆదాయాన్ని లెక్కించడం మొదలుపెట్టారు.. ఈ భేద భావం.. చాలా మంది బీసీ వర్గాల పిల్లలకు, రిజర్వేషన్ హక్కు దక్కకుండా చేసింది. మొన్న ఇచ్చిన తీర్పుతో సుప్రీంకోర్టు.. బీసీ అభ్యర్థులను నానా అగచాట్లు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల మొండి వైఖరిపై మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తులు పిఎస్ నరసింహ, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. వెనుక బడిన వర్గాల వారికి దక్కాల్సిన ప్రయోజనాలను ఓబీసీలలోని సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలు కైవసం చేసుకోకుండా నిలువరించడం కోసమే క్రీమిలేయర్‌ను మినహాయించడం తప్ప.. అదే సామాజిక వర్గానికి చెందిన సమాన స్థానాల్లో ఉన్న సభ్యుల మధ్య కృత్రిమ వ్యత్యాసాలను సృష్టించడం కాదు. అని స్పష్టీకరించింది. హేతుబద్ధమైన సమర్థన లేకుండా అదే వెనుకబడిన తరగతిలోని ఒక వర్గానికి ప్రతికూలతలు కలిగించే వ్యాఖ్యానాన్ని అవలంబించడం సమానులను అసమానులుగా పరిగణించడమేనని, అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ప్రైవేట్ సంస్థలు, పీఎస్‌యూలు, బ్యాంకుల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులకు భిన్నంగా పరిగణించడం, దాని ఆధారంగా రిజర్వేషన్ అర్హతను నిర్ణయించడం వివక్షకు సమానం అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆఫీస్ మెమోరాండంలో ప్రస్తావించిన అంశాల్లో ఏదైనా అస్పష్టత ఉంటే వివరణ లేఖల ద్వారా ఆ అస్పష్టతను తొలగించవచ్చు తప్ప.. ఆఫీసు మెమోరాండం ద్వారా దాఖలు పడిన హక్కులను ఆ తర్వాత ఇవ్వబడిన వివరణ లేఖ ద్వారా రద్దు పరచడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అంతిమంగా.. సదరు ఓబీసీ అభ్యర్థులను నాన్ క్రీమి లేయర్‌గా పరిగణించాలని, వారికి దక్కాల్సిన ఉద్యోగాలను.. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి మరీ అందించాలని.. కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అర్హతలు సాధించిన బీసీ అభ్యర్థులు ఉన్నా సరే.. నాట్ ఫౌండ్ సూటబుల్ అనే నిబంధనను ఉపయోగించి.. బీసీలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలను ఖాళీగానే ఉంచుతున్నారు. మరోవైపు మోడీ ప్రభుత్వం లాటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా రిజర్వేషన్ నిబంధనలు పక్కకు నెట్టేసి ఆధిపత్య వర్గాలకు చెందిన అభ్యర్థులతో ఉన్నత స్థానాలను నింపేస్తున్నది. మండల్ కమిషన్ అమలు ద్వారా 27% రిజర్వేషన్ల హక్కు బీసీ వర్గాలకు దక్కి నేటికీ 33 ఏళ్లు గడుస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నేటికీ 17 శాతం మాత్రమే బీసీ అభ్యర్థులు కొలువు తీరారు. ఉన్నత స్థాయి పదవుల్లో మరింత హీనంగా కేవలం నాలుగు శాతం బీసీ అభ్యర్థులే స్థానం సంపాదించగలిగారు.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# కెమెరాతో చరిత్రను చెక్కినవాడు!

‘తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?’ అన్నాడు శ్రీశ్రీ. ఈ వాక్యాన్ని చూశారో లేదో కానీ తాజ్ మహల్ నేపథ్యంలో రఘురాయ్ తీసిన ఎన్నో ఛాయాచిత్రాలు అదే భావాన్ని చెబుతాయి. ‘ఛాయాచిత్రం ఒక కవిత చెప్పాలి, ఓ కథ వినిపించాలి, వీక్షకుడు దాని లోతులు కనుగొనేందుకు ఓ యోగిలా తదాత్మ్యయంగా నిలబడిపోవాలి’ అని చెప్పే ఆయన బొమ్మలన్నీ మనందరి జీవితాలకు ప్రతిబింబాలు ఉంటాయి. ‘ఛాయాచిత్రం కేవలం నిశ్చల దృశ్యం కాదు, అది ఆ చిత్ర సందర్భాన్ని, ప్రకృతి అనుభూతిని, అంతరంగ శక్తిని వ్యక్తపరచాలి’ అని ఆయనే మరో చోట అన్నారు. ఫిలిం కెమెరాతో పనిచేసిన రోజుల్లో తాను కోరుకున్న తీరులో ఆబ్జెక్ట్ ను కాప్చర్ చేసేందుకు గంటలు, రోజులు వేచి చూశానంటారు. దేశం గర్వించదగ్గ ఫోటోగ్రాఫర్, ఫొటో జర్నలిస్టు అయిన రఘురాయ్ ఏప్రిల్ 26 న ఢిల్లీలో కన్నుమూశారు. 23 వ ఏట పట్టుకున్న కెమెరాతో 60 ఏళ్ల ఆయన ప్రయాణం ఆ రోజుతో ముగిసింది.

రఘురాయ్ తన ఛాయాచిత్రాల కోసం పేరున్నవారికన్నా సామాన్యులనే ఎక్కువగా ఎంచుకున్నారు. ఫోటో చెప్పే విషయం ముఖ్యం కానీ ఫొటోలో ఉన్న వ్యక్తి కాదని ఆయన ఉద్దేశ్యం. రఘురాయ్ ఫౌండేషన్ లో ప్రదర్శనకు ఉంచిన చిత్రాలను చూస్తే ఆయన ప్రాధాన్యతలేమిటో అర్థమౌతాయి. భారతదేశంలోని మనుషులు, ప్రకృతి, చారిత్రక కట్టడాలు, పండుగలు, మేళాలు అన్ని 360 డిగ్రీల్లో ఆయన ఫోటోల్లో కనిపిస్తాయి. శ్రమజీవుల చెమట పనులు, కష్టజీవుల నివాసాలు, ముదిమి వయసు ముఖ రేఖల్లో దాగున్న జీవితానుభవాలు ఆయన ఫోటోల్లో దగ్గరగా చూడవచ్చు.

ఒక ఫోటో ఫ్రేమ్ లో ఏముండాలి, దాని నేపథ్యం ఎలా జత కావాలి, ఆ రెంటి మేళవింపుతో ఏం చెప్పాలి అనే కోణంలోనే రఘురాయ్ ఛాయాచిత్రాలు ఉంటాయి. 1942 లో పంజాబ్ ప్రావెన్సీ లోని ఓ గ్రామంలో పుట్టిన రఘురాయ్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. ఫొటోగ్రఫీ పై ఇష్టంతో 1966 లో స్టేట్స్ మన్ పత్రికలో ఫోటో జర్నలిస్టుగా చేరారు. 1967 లో ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ టేబుల్ చుట్టూ గుమిగూడిన కాంగ్రెస్ నాయకుల ఫోటో సంచలనం సృష్టించింది. ఇందిర ఒక్కరే కూర్చొనగా మిగతా అందరు నిలబడడం ఆ ఫొటోలోని విశేషం. పదేళ్లు స్టేట్స్ మన్ లో పని చేసి తర్వాత ఫ్రీలాన్సర్ గా మారారు. బంగ్లాదేశ్ శరణార్థుల దుస్థితిపై 1972 లో ఆయన తీసిన చిత్రాలు చాలా పత్రికల్లో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత పారిస్ లో వాటి ప్రదర్శన జరిగింది. ఆ చిత్రాల్లో రాయ్ చూపిన ప్రతిభ కారణంగా ఆయనకు 1977 లో ‘మాగ్నమ్ ఫోటోస్’ లో




సభ్యత్వం లభించింది. ప్రపంచ స్థాయి ఫోటోగ్రాఫర్ల కూడలి అది. 1974 లో ఇందిరాగాంధీ జీవితంలో ఓ రోజు పేరిట దినమంతా ఆమెను ఫోటోలు తీస్తూ గడిపారు. తర్వాత అది పుస్తకంగా వచ్చింది. 1982 నుండి పదేళ్ళపాటు ఆయన ఇండియా టుడే లో ఫొటోగ్రఫీ విభాగానికి డైరెక్టర్ గా ఉన్నారు. 1984 లో సంభవించిన భూపాల్ గ్యాస్ లీక్ విషాదాన్ని ఆయన ఫోటోల్లో బంధించారు. విషవాయువు పీల్చి మరణించిన పసివాడి ఫోటో ఆ దుర్ఘటనకు అద్దంగా నిలుస్తుంది. మట్టిలో కప్పిపుచ్చిన ఆ పసివాడి ముఖంలో కళ్లు తెరిచి ఉండడం అందరిని కలచివేస్తుంది. ఆ ప్రాణం లేని చూపులో వేల ప్రశ్నలు కనిపిస్తాయి.

భారతీయ జీవన గతులను పట్టుకొన్న ఆయన ఫోటో వ్యాసాలు టైమ్, లైఫ్, న్యూయార్క్ టైమ్స్, ది ఇండిపెండెంట్ లాంటి విదేశీ పత్రికల్లో కూడా వచ్చాయి. 1990 -97 దాకా వరల్డ్ ప్రెస్ ఫోటో పోటీకి జ్యూరీ మెంబర్ గా ఉన్నారు. 1972 లో ఆయనకు పద్మశ్రీ లభించింది. 1992 లో అమెరికా ఆయన్ని ఫోటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ గా ఎంపిక చేసింది. 1997 భారత సమాచార మంత్రిత్వ శాఖ ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం అందించింది.

స్విట్జర్లాండ్, యు ఎస్ ఏ, ఫిన్ లాండ్, ఇటలీ, చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో ఆయన ఫోటోల ప్రదర్శన ఏర్పాటైంది.

ఆ రెంటి మేళవింపుతో ఏం చెప్పాలి అనే కోణంలోనే రఘురాయ్ ఛాయాచిత్రాలు ఉంటాయి. 1942 లో పంజాబ్ ప్రావెన్సీ లోని ఓ గ్రామంలో పుట్టిన రఘురాయ్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. ఫొటోగ్రఫీ పై ఇష్టంతో 1966 లో స్టేట్స్ మన్ పత్రికలో ఫోటో జర్నలిస్టుగా చేరారు. 1967 లో ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ టేబుల్ చుట్టూ గుమిగూడిన కాంగ్రెస్ నాయకుల ఫోటో సంచలనం సృష్టించింది. ఇందిర ఒక్కరే కూర్చొనగా మిగతా అందరు నిలబడడం ఆ ఫొటోలోని విశేషం. పదేళ్లు స్టేట్స్ మన్ లో పని చేసి తర్వాత ఫ్రీలాన్సర్ గా మారారు. బంగ్లాదేశ్ శరణార్థుల దుస్థితిపై 1972 లో ఆయన తీసిన చిత్రాలు చాలా పత్రికల్లో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత పారిస్ లో వాటి ప్రదర్శన జరిగింది. ఆ చిత్రాల్లో రాయ్ చూపిన ప్రతిభ కారణంగా ఆయనకు 1977 లో ‘మాగ్నమ్ ఫోటోస్’ లో సభ్యత్వం లభించింది.

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు



బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు. బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం. బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే ‘లలిత ఓ మానస్’ అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు. బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది. దేశాన్ని మాతృమూర్తిగా సంబోధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, ‘వందేమాతరం’ గీత రచన చేసిన రతర్వాత దానిని ‘ఆనంద్‌మఠ్’ నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు. భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం. మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటోపాధ్యాయను ప్రసంసించారు.

నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

# యువతకు మేల్కొలుపు మంగళ్‌పాండే ఆత్మత్యాగం..

బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం అలనాడు జరిగిన పోరాటంలో ఎందరో ధీరులు ప్రాణాలర్పించారు. తెల్లదొరలపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. ప్రాణాలకు లెక్కచేయక బ్రిటీష్ వారి మీద తుపాకీ ఎక్కు పెట్టిన ధైర్యవంతుడు. బ్రిటిష్ వారి పెత్తనానికి తలవొగ్గి వారు చేస్తున్న అరాచకాలు, అవమానాలు మౌనంగా భరించిన భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వైపు మళ్లించిన ఘనత మంగళ్ పాండేదే. బ్రిటిష్ పాలన నుండి దేశాన్ని విడిపించేందుకు తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడుగా మంగల్ పాండే భారత చరిత్రలో నిలిచి పోయాడు. 1857 నాటి తిరుగుబాటులో అతను కీలక పాత్ర పోషించాడు. మూడుపదుల వయసుకు చేరకుండానే ఉరికంబం ఎక్కేందుకు ఏ మాత్రం వెనకడుగు వేయని ధైర్యవంతుడు, తన త్యాగం దేశంలోని యువతను మేల్కొలుపు తుందని, విశ్వసించాడు. తన ఆత్మ బలిదానం మరెందరో వీరులకు స్ఫూర్తిని కలిగిస్తుందని, అలా స్ఫూర్తిని పొంది భరతమాత దాస్య విముక్తికి అంకితం అవుతారని, ఆ దిశగా యత్నం చేస్తారని భావించాడు. సుమారు రెండు శతాబ్దాలు మన దేశాన్ని పాలించిన శ్వేత జాతీయులపై తిరుగు బాటును ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. మంగళ్ పాండే 1827 జూలై 19 న నేటి ఉత్తరప్రదేశ్ నందు గల ఫైజాబాద్ జిల్లాలోని సుర్హపుర అను గ్రామంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. 22 సంవత్సరాల వయసులో మంగళ్ పాండే తనకు తెలిసిన వ్యక్తి ద్వారా తాను సిపాయిగా చేరాడు. శిక్షణ అనంతరం పాండేని 34 బెంగాల్ రెజిమెంట్ లోని 6వ కంపెనీకి సిపాయిగా పంపించారు. సెలవులకు ఇళ్లకు వెళ్లి వచ్చిన సైనికుల ద్వారా బ్రిటీషు వారి దోపిడీలు, దేశమంతటా చెలరేగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం గురించి వార్తలు అందుతుండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు సంఘటితంగా బ్రిటిషు వారిపై 1857 మే 31 న తిరుగుబాటు జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ తిరుగు బాటుకు నాయకత్వం వహించిన వారిలో ఝాన్సీ రాణి లక్ష్మిబాయి, తాంతియా తోపె, బహదూర్ షా తదితరులు ఉండిరి. తుపాకీ తూటాల తయారీలో గోవు, పంది కొవ్వు వాడుతున్న విషయం సైనికులకి తెలిసి లోలోపల రగిలి పోయారు. గోమాంసం వాడకం గురించి తెలుసుకున్న మంగళ్ పాండే ఉడికిపోయి, తోటి సైనికులతో తిరుగు బాటుకు పథకం వేశాడు. ఈ విషయం బ్రిటిషు అధికారులు మార్చి 29 న గుర్తించారు.

తమ తమ తుపాకీలని సిద్ధంగా ఉంచుకొని, కన్పించిన బ్రిటిషు అధికారినల్లా కాల్చి పారేయాలని తోటి సైనికులందర్నీ ఉత్తేజ పర్చాడు పాండే . ఈ లోగా అధికారి వాగ్ రావటం మంగళ పాండే అతనిమీద తూటా పేల్చటం జరిగింది, కానీ అది గురితప్పి అతని గుర్రానికి తగిలింది. చేతి పిస్టల్ తో కాల్పులు జరిపాడు వాగ్. తప్పించుకున్న మంగళ్ పాండే తిరగబడి, తన తుపాకీ తో కొట్టబోయాడు. అప్పటికే చేరుకున్న శార్జంట్ హ్యూసన్ వచ్చి పాండే చేతిలోని తుపాకీని నెట్టి పారేశాడు. పాండే ని అరెస్ట్ చేయమని అధికారులు ఆదేశించినా ఎవ్వరూ ముందుకు రాలేదు. తెల్లవారి చేతికి చిక్కటం ఇష్టం లేక, తన తుపాకీతో తానే కాల్చుకాగా, ఆ బుల్లెట్ గాయం చేసింది కానీ ప్రాణం తీయలేదు. తర్వాత భయంతో అతన్ని బ్రిటిషు అధికారులు సమీపించి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల్లో కోలుకున్న మంగళ్ పాండే మీద రాజద్రోహం, తిరుగుబాటు నేరాలు మోపి కోర్టులో హాజరు పరిచారు. వీలైనంత త్వరగా విచారణ ముగించటం, ఉరిశిక్ష విధించటం ఆంగ్లేయ పాలకుల దుర్నీతికి పరాకాష్ఠ. విచారణలో మంగళ్ పాండే ధైర్యంగా ఇలా ప్రకటించాడు… “నేను చేసిన తిరుగుబాటు నా దేశం కోసం, నా ధర్మం కోసం చేశాను. ఇది నా స్వప్రేరణతో నా మాతృభూమి కోసం చేశాను, అంతే కానీ దీనికి మరెవ్వరినీ బాధ్యులని చేయొద్దు”. విచారణ పూర్తిచేసి, ఏప్రిల్ 18న ఉరితీయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే తిరుగుబాటు వార్త వ్యాపించి, అనేక రెజిమెంట్లలో చైతన్యం మొదలయ్యింది. మరోవైపు అనేక రాజ సంస్థానాలు, సంస్థానాల్లోని ప్రజలు తిరుగుబాటుకు ఏకమయ్యారు.

# ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయండి

### -ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి వెల్లడి

**నిజామాబాద్ సిటీ, ఆగస్టు 31( ప్రజాగళం )**ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయాలని ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి వెల్లడించారు..సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్వో లకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.డిఎంహెచ్ఓ ఛాంబర్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పాఠశాలలో కళాశాలలో ఆరోగ్యం పైన అవగాహన కలిగించాలని, జీవనశైలి వ్యాధులపై, క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ ఊబకాయానికి గురికాకుండా చూడాలన్నారు.కాలేజీలలో మిస్టర్ అండ్ మిస్ట్రెస్ లను ప్రోత్సాహిస్తూ మారథాను రన్నింగ్ కాంపిటీషన్లను నిర్వహించాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రోత్సాహంగా అందించాలన్నారు. టీబీ,ఎంబీఏ లో భాగంగా ప్రతి కుటుంబాన్ని, డ్వాక్రా మహిళలను, బీడీ వర్కర్లను ప్రభుత్వ ఆధీనంలోని వి ఏ ఓ లు ,విలేజ్ సెక్రటరీలను, మెప్మా మెంబర్లను ఉపయోగించి కౌన్సెలింగ్, అవగాహన కలిగించాలన్నారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా మెడికల్ కాలేజ్ విద్యార్థులతో ప్రతి మండలంలో హెచ్ఐవి,ఎయిడ్స్ పైన అవగాహన కలిగించాలని అన్నారు. ఆశ కార్యకర్తల్లో ఆరోగ్యంపై అవగాహన విస్తృతంగా కలిగించి వారి సేవలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తి వ్యాధి నిరోధక టీకలను 100 శాతం ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైతే వ్యాధి నిరోధక టీకాలకు వ్యతిరేకత ఉన్నదో అక్కడ వారికి విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న ఔషధాలపై విస్తృతంగా అవగాహన కలిగించాలని, వైద్యధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. వైద్యాధికారులకు నెలకోసారి ఫిజికల్ సమావేశం నిర్వహించాలని సూచించారు.. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసినప్పుడే తేరిసియరి ఆరోగ్యం పై భారం పడదన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ కొత్త దనాన్ని, సృజనాత్మకత దృష్టితో సాధారణ సేవలకు భిన్నంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మాతాశిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా జరిగితే ఎందుకు జరిగినాయి అని కారణాలను వెతికి అవి పునరావృతం



కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అన్ని జాతియా ఆరోగ్య కార్యక్రమాలపై డిఎంహెచ్ఓ రాజశ్రీ మేడం వివరించారు.ప్రోగ్రాం అధికారులు వారి వారి కార్యక్రమాలపై నివేదిక ఇచ్చారు.. ఈకార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ బేబీ నాగేశ్వరి, డి ఐ ఓ డాక్టర్ అశోక్, ఏఓ సుమంత్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విద్య, సికందర్ నాయక్, డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ అంజన, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భార్గవి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ కీర్తన, ఎస్ఓ రాజేశ్వర్ , ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ,డిపిఓ విశాల, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్..?!

**అదిలాబాద్:** ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో గైని పాత్ర కీలకం

### - గైని గంగారం సేవలను కొనియాడిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్, ఆగస్టు 31( ప్రజా గళం )** తెలంగాణ రాష్ట్ర సాధనలో టీఎన్జీవోస్ నాయకుడు గైని గంగారం పాత్ర కీలకమని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్లో టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో జరిగిన గైని గంగారం పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైని గంగారాం ఉద్యోగ సంఘ నాయకులుగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత దక్కిందని కొనియాడారు.గత 40 సంవత్సరాలుగా నీటిపారుదల శాఖలో విధులు నిర్వహిస్తూ సూపరింటెండెంట్ గా సోమవారం పదవి విరమణ చేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారాం కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గైని దంపతులను అతిథులు శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించి ఆత్మీయ జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుసేని ముజీబ్, టీఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, రైతు కమిషన్ రాష్ట్ర సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి కోలా శ్రీనివాస్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, కోశాధికారి నిరంజన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్,జాఫర్ హుస్సేన్,శ్రీనివాస్,మాణిక్యం, జాకీర్ హుస్సేన్,జ్ఞానేశ్వర్ రెడ్డి, సృజన్ కుమార్, ప్రవీణ్ రాజ్, సూర్యప్రకాష్,కార్తీక్,మారుతి, గీతారెడ్డి,మంగారెడ్డి శ్రీ వేణి, రాజేశ్వర్,గురు చరణ్,టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై గైనికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**నిజామాబాద్ ఆగస్టు 31 (ప్రజాగళం ప్రతినిధి )**రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల



ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ రోడ్డు కబ్జా

### - మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు





**ఆర్మూర్ ఆగస్టు 31 (ప్రజాగళం)**ఆర్మూర్ పట్టణంలోని 26వ వార్డు రాజారాం కాలనీలో గల ఇరిగేషన్ స్థలం యదేచ్ఛగా కబ్జాకు గురవుతుందని కాలనీవాసులు బీజేవైఎం టౌన్ జనరల్ సెక్రెటరీ పెద్దోళ్ల భరత్ , కొత్తూరు ఆనంద్ , అవిశెట్టి నారాయణ, రుద్ర రవి గట్ల గణేష్ లు మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా 20వ వార్డులో కెనాల్ కట్ట ఆనుకొని ఇరిగేషన్ స్థలం కబ్జాకు గురవుతుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మశానానికి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. గత కొంతకాలంగా కొందరు రాజకీయ పలుకుబడిన ఉపయోగించి యదేచ్ఛగా స్థలానికి కబ్జా చేస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నించినప్పటికీ ఏం చేస్తారో చేసుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరిగినా ఇటు మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లక్షలు విలువ చేసే స్థలాన్ని ఇరిగేషన్ స్థలాన్ని ఆనుకొని ఉన్న కొందరు కబ్జా చేయడంపై ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని గుర్తించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# కవితకు అడుగడుగునా నీరాజనం

### - జనసంద్రంగా మారిన పాంచజన్య సంకల్పసభ






**నిజామాబాద్ సిటీ ఆగస్టు 31 (ప్రజాగళం)**నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన పాంచ జన్య సంకల్ప సభ జనసంద్రంగా మారింది. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ముందుగా ఇందల్వాయి టోల్గేట్ వద్ద ప్రజలు ఆమెకు స్వాగతం పలికి అక్కడి నుండి మాధవ నగర్ సాయిబాబా టెంపుల్ మీదుగా బోర్గం వరకు చేరుకున్న తర్వాత అక్కడ మహిళలు టీఆర్ఎస్ నాయకులు గజమాలతో ఆమెకు స్వాగతం పలికారు. అక్కడినుండి ర్యాలీగా ప్రారంభమై పులాంగ్ మీదుగా ఆర్అర్ చౌరస్తా, నెహ్రు పార్కు గాంధీ చౌక్ మీదుగా ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ కు చేరుకున్నారు. ర్యాలీలో ప్రజలు ఆమెకు ఘనంగా స్వాగతం స్వాగతం పలికారు. మహిళలు బోనాలతో ఆమెకు స్వాగతం పలికినప్పుడు ఆనందోత్సవాలలో కవిత మునిగిపోయారు ఆమె ఆనందానికి హద్దులు లేవని సంతోషం వ్యక్తం చేశారు. కవిత సభ స్థలానికి చేరుకోగానే జనము పెద్ద ఎత్తున కేకలు వేసి స్వాగతం పలికారు. ముందు వరసలో ఉన్న ప్రతి మహిళకు కరచాలన చేశారు.

# తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు న్యాయం జరగాలి

### - ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కవితకు విజ్ఞప్తి

**నిజామాబాద్ సిటీ ఆగస్టు 31 (ప్రజాగళం)**తెలంగాణ రాష్ట్రంలోని మాదిగ కులాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లమారి సుధాకర్ మాట్లాడుతూ,రాష్ట్రంలో మాదిగలు సుమారు 60 లక్షల మంది ఉన్నట్లు తెలిసిందే.అన్ని కులాల కంటే రాష్ట్రంలో మాదిగలే ఎక్కువగా ఉన్నారు. కానీ మాదిగలకు దేనిలోనూ ప్రాధాన్యత లేక పోవటం విచారించదగిన విషయం అని అన్నారు. మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యత లేదనీ,మాదిగలకు లోన్లు, ఇండ్లు ఇవ్వరనీ, . ఇండ్ల పంపకంలో పూర్తిగా అన్యాయం జరుగుతుందనీ సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాదిగలకు పూర్తి న్యాయం చేయాలని లేఖలో కవితను కోరారు. అదేవిధంగా ఇప్పటి వరకు నిజామాబాద్ లో మాదిగలకు కళ్యాణ మంటపాలు




లేవని. మాదిగ భవనం లేదని. అన్ని కులాలకు ఎకరాలకు ఎకరాలు పంచిన ప్రభుత్వాలు మాకు ఎందుకు భూమి ఇవ్వటం లేదనీ కవితకు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు..గతంలో మాదిగల పేరు చెప్పి ఓట్లు వేయించుకుని ప్రభుత్వాన్ని చేపట్టిన తర్వాత ఏ రంగంలోనూ ప్రాధాన్యతను ఇవ్వకుండా మాదిగలను అట్టడుగున తొక్కారని ఆరోపించారు.వేల సమస్యలు, వందల ప్రశ్నలు ఏ ప్రభుత్వం కూడా పరిష్కరించలేదు. రాబోయే రోజుల్లో మీ ప్రభుత్వం ఏర్పాటయితే మా మాదిగల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కవితకు వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

### - ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్

**ఆర్మూర్ ఆగస్టు 31 ( ప్రజా గళం)**విద్యార్థులు గంజాయి ,డ్రగ్స్ మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో మన ఊరు– మన భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. యువత పేడ త్రోవపడకుండా గంజాయి ,డ్రగ్స్ మత్తు పదాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణవేణి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**పోయిన ఫోన్లను అందజేసిన ఎస్ హెచ్ ఓ**

ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్




ఫోన్లను బాధితులకు ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ అందజేశారు. సోమవారం బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందజేశారు. అందజేసిన వారిలో హైమత్ అలీ వెంకటకృష్ణ మహ్మద్, దుబ్బిర్యాల శ్రీకర్ నేరేడు లింగారెడ్డి రాజేష్ రమేష్ లకు ఫోన్లను అందజేశారు.

# ప్రజావాణికిఫిర్యాదుల వెల్లువ

**నిజామాబాద్, ఆగస్టు 31 ( ప్రజా గళం ప్రతినిధి)** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 11 మంది హెడ్ కానిస్టేబుళ్ల కు ఏఎస్ఐలుగా పదోన్నతి

### - అభినందించిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.

**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 31 ( ప్రజా గళం )**నిజామాబాద్ జిల్లాలో 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. వారిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశానుసారము నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఎ.యస్.ఐ లుగా పదోన్నతి సాధించిన సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్న హెడ్ కానిస్టేబుళ్లకు ఎ.యస్.ఐ లు గా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి 11 మంది ఎ.యస్.ఐ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.పదోన్నతి పొందినటువంటి వారి వివరాలు.యస్.గంగాధర్ రావు ,పి. రాజేశ్వర్ ,




పి. మోహన్ , బి.జగదీశ్,పి.చిన్న సాయిలు , జె.రాజశేఖర్ , జి.రాజేందర్ , పి.సుదర్శన్ ,కె. డేనియల్ భాస్కర్ ,కె. సుంకన్న,కె. మల్లేశం లు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు.

# అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

ఖమ్మం: తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ. 300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ. 300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమలో ఇప్పటికే నర్సరీ కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండగా.. దాదాపు మూడు లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1.40 లక్షల మేలైన మొక్కలను రైతులకు సరఫరా చేశారు. ఈ పరిశ్రమ పరిధి కిందికి సంగారెడ్డి జిల్లాతో పాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 12 మండలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సరికొత్త ఫ్యాక్టరీతో తెలంగాణలో ఆయిల్‌పామ్ పరిశ్రమల సంఖ్య నాలుగుకు చేరుకోనుంది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అప్పారావుపేటలో గంటకు 90 టన్నులు, అశ్వారావుపేటలో గంటకు 30 టన్నులు, సిద్దిపేట జిల్లా నర్మెటలో



గంటకు 30 టన్నులతో కర్మాగారాలు నడుస్తుండగా.. అంజనాపురం కర్మాగారం గంటకు 15 టన్నుల సామర్థ్యంతో అందుబాటులోకి వస్తోంది. ఇదే కాకుండా కల్లూరుగూడెం, బీచ్‌పల్లి, ఇంచర్ల, పెద్దరాత్‌పల్లి, సంకిరెడ్డిపల్లి, యాచారంలలో నిర్మాణ దశలో ఉన్న మరో ఆరు కర్మాగారాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో ఏర్పాటు కానున్న సీడ్ గార్డెన్ దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మలేసియా కంపెనీ భాగస్వామ్యంతో గోద్రెజ్ సంస్థ ఈ విత్తన తోటను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. దీని ద్వారా రైతులకు తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలు లభిస్తాయని ఇవి అంతర్గత పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రైవేటు సమీకృత పరిశ్రమ రాకతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత వేగంగా పెరగనుందని ఆయన వెల్లడించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక లాభాలను ఇచ్చే వాణిజ్య పంటలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

సూరి భగవంతం (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయదృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు.

ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు.

# కాంగ్రెస్ తో కటీఫ్..!
# మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ..?



**హైదరాబాద్,** : చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది. గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఇతర కులాలను సమాజంలోని కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యలు ఆయనకున్న న్యూట్రల్ ఎడ్యుకేటెడ్ ఓటర్ బేస్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. విద్యావంతులు గ్రాడ్యుయేట్లు ఓటేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో మల్లన్న తన పాత ఇమేజ్‌ను పోగొట్టుకుని దారి తప్పిన నాయకుడిగా మిగిలిపోయారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం ఓటు బ్యాంకు అండగా ఉండవు. ప్రధాన పార్టీలు ఈ విస్తృత నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పక్కా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. కాంగ్రెస్ వైపు నుంచి అధికారిక అభ్యర్థి బరిలో ఉంటారు కాబట్టి పోటీ మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి త్రిముఖ లేదా చతుర్ముఖ పోరులో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ లేకుండా కేవలం సొంత ఇమేజ్‌తో బరిలోకి దిగడం పెద్ద సాహసమే. అందుకే పాదయాత్ర ద్వారా మళ్లీ జనం లోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలని ఆయన తీవ్రంగా భావిస్తున్నారు. పాదయాత్రలు చేయడం తేలికే అయినా పట్టభద్రుల మైండ్ సెట్‌ను మార్చడం మల్లన్నకు అంత సులభం కాకపోవచ్చు. ఒకవేళ పాదయాత్ర చేసినా కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించలేకపోతే గత కొన్నేళ్లుగా ఆయన చుట్టూ ఉన్న పొలిటికల్ హడావుడి ప్రసహనంలా మారుతుంది. తన పాత ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకుని విద్యావంతులను మెప్పించే సరైన అజెండాతో వస్తే తప్ప రాబోయే ఎన్నికల పోరు ఆశాజనకంగా ఉండే అవకాశం లేదు. లేకపోతే ఆయనను పట్టించుకునే వారే కరువవుతారు.

# పశ్చిమలో ఆందోళనలకు వైసీపీ పిలుపు



**హైదరాబాద్,** : ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ధరల సంక్షోభంపై వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతు ప్రతినిధులు, నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా, పండిన 232 మిలియన్ కిలోల పొగాకులో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేయడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం మొదలైతే ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా వచ్చే వారం పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోపాలపురం, జంగారెడ్డిగూడెంలో పర్యటించి ఆందోళనలు చేపడతానని, ప్రభుత్వం స్పందించకపోతే కందుకూరులోనూ పర్యటిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి పొగాకు ధర రూ. 200కు తగ్గకూడదని హెచ్చరించిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోయాయని జగన్ ఆరోపించారు. పొదిలి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో రూ. 130 నుంచి రూ. 186 మధ్యలోనే కొనుగోలు చేయడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోందన్నారు. వ్యాపారులు నో బిడ్లు పెడుతూ, బేళ్లను తిరస్కరిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. నిబంధనలు పాటించని కంపెనీలపై ఒక్క కేసు నమోదు చేయలేదని, లైసెన్సులను సస్పెండ్ చేయకపోవడం వల్లనే వ్యాపారులకు భయం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తన హయాంలో రైతుల రక్షణ కోసం అమలు చేసిన విప్లవాత్మక చర్యలను ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలోనే తొలిసారిగా మార్క్‌ఫెడ్ ను పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌పైకి తీసుకొచ్చి కొనుగోళ్ళ చేపట్టామని, దీనివల్ల వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమై పోటీ పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కాయని పేర్కొన్నారు. అలాగే రూ. 3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి, ఐదేళ్లలో పంటల కొనుగోళ్ల కోసం రూ. 7,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చి, సీఎం యాప్ ద్వారా ప్రతికూల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో తక్షణమే కొనుగోళ్లు జరిపించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను కొనుగోళ్లలోకి రానివ్వకుండా అడ్డుకోవడమే వ్యాపారుల సిండికేట్‌కు కొమ్ముకాయడమేనని జగన్ ఆరోపించారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభం, కానీ నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని లేపాలంటే గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందే అని వ్యాఖ్యానించారు. రైతుల బాగు కోరే ప్రజా ప్రభుత్వం వచ్చేవరకు తాము విశ్రమించబోమని, పొగాకు రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకుని, హామీ ఇచ్చిన ధరలకు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ జిల్లాలో ఏ పంట రైతు ఇబ్బంది పడుతున్నా వైయస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని జగన్ భరోసా ఇచ్చారు. ఏదో ఒక ధరకు మా పంట కొని మమ్మల్ని బతికించండి అని రైతులు దేహీ అని వేడుకునే దుస్థితికి ప్రభుత్వాధినేతల నిర్లక్ష్యమే కారణమన్నారు. వ్యాపారులకు లాభాలు చేకూర్చే ధోరణి వీడి, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజా నిరసనల సెగ ప్రభుత్వాన్ని తాకడం ఖాయమని స్పష్టం చేశారు.

# కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ

**హైదరాబాద్,** : తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్-జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ-బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్-జీ తీవ్రస్థాయిలో రీ-కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్టే పార్టీ పెట్టేలా యువజన సమూహాలను




ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి. భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్-జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యాసంస్కరణలేనని కాంగ్రెస్ వర్గాలు సమర్థిస్తున్నాయి. డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేని విద్యార్థులను తీర్చిదిద్దడానికి జర్మనీ, ఫిన్లాండ్ మోడల్స్‌లో మొదటి రెండేళ్లు బేసిక్ విద్య, చివరి రెండేళ్లు ప్రాక్టికల్ విదేశీ లాంగ్వేజెస్, అప్రెంటిస్‌షిప్ నైపుణ్యాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొంటున్నారు. అయితే, విధానపరమైన లోపాన్ని ఎత్తిచూపే క్రమంలో వాడిన క్రిమినల్ వేస్ట్ అనే పదం కమ్యూనికేషన్ ఫెయిల్యూర్‌గా మారి, రాజకీయ ప్రత్యర్థులకు రాజకీయ ఆయుధంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు జెన్-జీ అసంతృప్తిని క్రిమినల్ వేస్ట్ ఉద్యమంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా, అది ఎంతకాలం మనుగడ సాగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ ( చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు. పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు. సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం. గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి. చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలో సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది. ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లను కొనుగోలు చేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com